మేల్కోకపోతే ముప్పే


కొమ్మలేరు వాగులో దట్టంగా పెరిగిన జమ్ము, కంపచెట్లు


కొమ్మలేరు వాగు ఉప్పొంగడంతో మునిగిన పొలాలు(ఫైల్)

- పూడికతో నిండిన కొమ్మలేరు వాగు
- భారీ వర్షం పడితే 8 గ్రామాలకు ముంపు సమస్య
- గతంలో రెండుసార్లు పొలాలు మునిగి పంటలు నష్టం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు
- వర్షాకాలంలోగా పూడికతీత చేపట్టాలని విజ్ఞప్తి

సోమశిల: అనంతసాగరం మండలంలోని కొమ్మలేరువాగు పూడికతో నిండింది. భారీ వర్షాలు పడితే వర్షపు నీరు సజావుగా వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో మాగాణి భూములు ముంపునకు గురై పంటలు నష్టపోయే ప్రమాదం ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కొమ్మలేరువాగు 16 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఆమనిచిరువెళ్ల చెరువు అలుగు వద్ద నుంచి కొమ్మలేరు వాగు ప్రారంభమవుతుంది. ఆత్మకూరు మండలం బండారుపల్లి వద్ద పెన్నా నదిలో కలుస్తుంది. మండలంలోని 8 గ్రామాల మీదుగా వాగు ప్రవహిస్తుంది. ఆమనిచిరువెళ్ల, ఇనగలూరు చెరువుల అలుగులతో పాటు పాటు 8 గ్రామాల పరిధిలోని సుమారు 1800 ఎకరాల మాగాణి భూముల్లోని వరద నీరు వాగు ద్వారా పెన్నా నదిలో కలుస్తుంది. అయితే పలు ప్రాంతాల్లో వాగు పూడికతో నిండి ఉంది. కంపచెట్లు, జమ్ము దట్టంగా పెరిగిపోయి ఉన్నాయి. దీంతో భారీ వర్షాలు పడి చెరువులు అలుగులు పారితే వరద నీరు సజావుగా వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. వాగు కట్టలు సైతం ధ్వంసమై ఉండడంతో పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు భారీ వర్షాలకు వాగు ఉప్పొంగడంతో పంటలు మునిగిపోయి తీవ్రంగా నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో తమ విజ్ఞప్తి మేరకు వాగులోని కొన్ని ప్రాంతాల్లో పూడిక తీత చేపట్టారని తెలిపారు. కొమ్మలేరు వాగు ముంపు సమస్యపై అధికారులు దృష్టి సారించి వర్షాకాలంలోగా పూడికతీత చేపట్టి ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రామాలకు రాకపోకలు బంద్

కొత్తపల్లి నుంచి కచిరిదేవరాయపల్లి, వెంగమనాయుడుపల్లికి వెళ్లే మార్గంలో కొమ్మలేరు వాగు ఉంది. వాగుపై బ్రిడ్జి లేదు. కొమ్మలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తే చప్టాపై వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండదు. దీంతో రెండు గ్రామాలకు రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పొలాలు మునుగుతాయి



కొమ్మలేరు వాగు పూడికతో నిండి భారీ వర్షాలు కురిస్తే వరద నీరు సజావుగా వెళ్లడం లేదు. దీంతో కచిరిదేవరాయపల్లి, వెంగంనాయుడుపల్లి, కాకారువారిపల్లి గ్రామాల్లోని పొలాలు నీట మునుగుతున్నాయి. అధికారులు స్పందించి వాగులో పూడికతీత చేపడితే రైతులకు మేలు జరుగుతుంది.

– కాకూరు నారసింహారెడ్డి, రైతు, కాకూరువారిపల్లి

తీవ్రంగా నష్టపోయాం



గతంలో కొమ్మలేరు వాగు వరదలకు పొలాలు మునిగిపోయి పంటలు దెబ్బ తిని తీవ్రంగా నష్టపోయాం. కొమ్మలేరు పూడికతో నిండడంతో వరద నీరు సజావుగా వెళ్లక ఈ పరిస్థితి నెలకొంది. మరోమారు అలా జరగకుండా అధికారులు స్పందించి ముందస్తుగా పూడికతీత పనులు చేపట్టాలి.

– నాగం సాంబశివారెడ్డి, పాతదేవరాయపల్లి

ప్రతిపాదనలు పంపాం

ఇరిగేషన్ డ్రైనేజీ ఏడబ్ల్యూ శ్రీనివాసరాజును వివరణ కోరగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, త్వరలో పనులు జరుగుతాయని తెలిపారు.

– శ్రీనివాసరాజు,ఈఈ,ఇరిగేషన్ డ్రెయిన్స్

అంధకారంలో అయ్యవారిపల్లి ఎస్సీకాలనీ

సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీలో గత పదిహేను రోజులుగా వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంది. జాతీయ రహదారి వద్ద నుంచి అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వీధి దీపాలను సైతం అమర్చారు. అయితే వీధి దీపాలకు కనెక్షన్ ఇవ్వడం మరిచిపోయారు. దీంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేందుకు తీవ్రఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఎస్సీ కాలనీలో వీధిదీపాలు వెలిగేంచేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు విరాళం



కావలి: మండలంలోని రుద్రకోటలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు అలహాబాద్ నిట్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ శివదత్‌కుమార్ నగదు విరాళాన్ని అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించిన ఆయన ఇక్కడి సౌకర్యాలు, విద్యార్థుల కోసం చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించి ముగ్ధులయ్యారు. కళాశాల అభివృద్ధికి రూ.25వేలు విరాళాన్ని అందజేశారు. ఆయనకు కావలి పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ఏ సుశీల్‌కుమార్ ప్రియ కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

450 మందికి వైద్యసేవలు



అల్లూరు: స్థానిక దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అల్లూరు చుట్టుపక్కల మండలాలకు చెందిన 450 మందికి వైద్యసేవలను అందించడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి తెలిపారు. నెల్లూరు కిమ్స్ ఆస్పత్రి, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు చెందిన వైద్యులు రోగులకు సేవలు అందించారని వివరించారు. టీడీపీ నాయకులు బీద గిరిధర్, ట్రస్ట్ మేనేజర్ అనిల్‌రెడ్డి, స్కిల్‌డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రారావు, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ టెట్‌కు స్పందన



ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో ఆదివారం నిర్వహించిన మోడల్ టెట్‌కు స్పందన లభించింది. 40 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. యూటీఎఫ్ నాయకులు కంబాల చంద్రశేఖర్‌రెడ్డి, గాజుల రంతుజానీ, మీనిగ ఫణిరాజ్, జీ సుబ్బారెడ్డి, నల్లబోతుల రామకృష్ణ, ఖాదర్‌బాషా, తదితరులు పర్యవేక్షించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ఆత్మకూరురూరల్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మహిమలూరు మెయిన్ పాఠశాల ఉపాధ్యాయుడు చందా రమేష్‌బాబును ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి నెల్లూరు బాలభవన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. నెల్లూరులోని శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రమేష్‌బాబును శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, కోఆర్డినేటర్ రామ్మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ



కొండాపురం: మండలంలోని భీమవరప్పాడు పంచాయతీ పరిధిలోని అరుంధతీయవాడలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి మాజీ సర్పంచ్ చాగంటి కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం భూమి పూజ నిర్వహించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేసి మినరల్‌వాటర్‌ను అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గురుదేవ్ శ్రీనివాస్, వింజమూరు మనోహర్ పాల్గొన్నారు.

ఆర్డీఓకు సన్మానం



ఆత్మకూరు: ఆత్మకూరు ఆర్డీఓగా విధులు నిర్వహిస్తూ నరసారావుపేటకు బదిలీ అయిన కురుబ మధులతను రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. తహసీల్దార్లు స్వప్న, సుభద్ర, సోమ్లానాయక్, రమణయ్య, వీరవసంతరావు, డీటీలు విజయ్, ప్రదీప్, శేషయ్య, సంధ్య, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలమయంగా రాజుపాళెం రోడ్డు



కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం నుంచి రాజుపాళెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. రెండు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. పలుచోట్ల తారు రోడ్డు ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. అడుగడుగునా గుంతలతో నిండడంతో రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును పునర్నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జనసేన పాదయాత్ర

ఆత్మకూరు: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా ఆత్మకూరు నియోజకవర్గ జనసేన నాయకులు ఆదివారం పాదయాత్ర చేపట్టారు పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ నుంచి ప్రారంభించి సంగంలోని శివాలయం వరకు పాదయాత్రను సాగించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్, జేపీ ప్రసాద్, శ్రీరామ్ పాల్గొన్నారు.

మనస్సుపై నియంత్రణ తప్పనిసరి


ప్రసంగిస్తున్న రామయ్య స్వామి

ఆత్మకూరు: ఏ పనిలోనైనా విజయం సాధించాలంటే పనిపై శ్రద్ధతో పాటు మనస్సును నియంత్రించుకున్నప్పుడే అది ఖచ్చితంగా అనుకున్న రీతిలో పూర్తవుతుందని ఇది భగవద్గీత చెప్పిన సూత్రమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆత్మకూరుకు చెందిన తెలుగుభారతి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే మంచిమాట కార్యక్రమం పట్టణంలోని గ్రంథాలయ భవనంలో జరిగింది. ప్రధాన వక్తగా రామయ్యస్వామి హాజరై భగవద్గీతపై ఉపన్యసించారు. మనిషి జీవితంపై భగవద్గీత ఎంతో ప్రభావం చూపుతుందన్నారు. భగవద్గీతను ఆచరించక ముందు, ఆచరించిన తరువాత జీవితాన్ని అంచనా వేసుకుంటే ఖచ్చితమైన మార్పు కనిపిస్తుందన్నారు. మానవులు తమ మనుగడకు భగవద్గీతను అవగాహన చేసుకుని అనుసరించాలన్నారు. అప్పుడే విజయపథంలో జీవితాలు సాగుతాయన్నారు. కోపం మనస్సును నాశనం చేస్తుందని, మనస్సును ప్రశాంతంగా ఉంచుకునేందుకు గీత సూత్రాలను అనుసరించాలన్నారు. సేవా సమితి అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు ఎస్ సుబ్బరాయుడు, అన్నపురెడ్డి పెదవెంకటరెడ్డి, గోవిందరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్వీ రమణయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు వీ నారాయణరావు, యానాదిరెడ్డి, కేవీ శేషారెడ్డి, లైబ్రేరియన్ రాజు, టీవీ సుబ్బయ్య, రాఘవేంద్ర రావు, రవీంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి, సంజీవరెడ్డినగర్ గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. అనంతరం భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి దుత్తలూరు అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు వెంకటేశ్వర్లు, సుధాకర్, నాగమ్మ, పెంచలరత్నం, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నైతికతే నిజమైన స్వేచ్ఛ


మాట్లాడుతున్న చాకలికొండ శారద

కావలి: పట్టణంలోని ముసునూరు మదర్సాలో జమాయతే ఇస్లామి ఈ హింద్ సంస్థ మహిళా విభాగం కావలి కన్వీనర్ ఫాతిమా ఆధ్వర్యంలో 'నైతికతే నిజమైన స్వేచ్ఛ'పై సదస్సును ఆదివారం నిర్వహించారు. కావలి ఉమెన్స్‌ఫోర్స్ కన్వీనర్ చాకలకొండ శారద హాజరై మాట్లాడారు. మనిషికి స్వేచ్ఛ చాలా అవసరమని, అది ఎదుటి వారికి భంగం కలిగించరాదన్నారు. గాంధీ చెప్పిన మాట ప్రకారం ఆడవాళ్లు అర్ధరాత్రి నడిరోడ్డుపై ఒంటరిగా తిరిగగలిగిన నాడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అన్నారు. అలా జరగాలంటే సమాజంలోని ప్రతిఒక్కరూ నైతిక విలువలతో ప్రవర్తించాలన్నారు. అశ్లీల సినిమాలు, పోర్న్‌సైట్లు యువతనేగాక అన్ని వయసుల వారిని ఆడవారిపై అఘాయిత్యాలకు ప్రోత్సహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటికి దూరంగా ఉంటేనే ఉత్తమపౌరులు కాగలరన్నారు. ఫాతిమా మాట్లాడుతూ దైవభీతితోనే నైతిక విలువలు సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ మనం చేసే పనిని రోజూ ఆత్మ పరిశీలన చేసుకుంటూ ఉండాలన్నారు. అప్పుడే మనలో మంచి చెడు తెలిసి నైతిక విలువలను పెంపొందించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో స్వాతి, సుజాత, హబీబా , షకీల, ఆయేషా , షాహీనా, హ్యూమరా తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ మాస్టర్‌కు పురస్కారం



చేజర్ల: చేజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్న కిషోర్‌కుమార్ క్రియేటివ్ హార్ట్స్ అకాడమి జాతీయస్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. కాకినాడలోని న్యూసెంచరీ స్కూల్‌లో క్రియేటివ్ హార్ట్స్ అకాడమి 9వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి చితలేఖన పోటీల్లో ప్రతిభకనబర్చిన కిషోర్‌కుమార్‌కు పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్రియేటివ్ హార్ట్స్ అకాడమి అధినేత అంజి ఆకొండి పాల్గొన్నారు.

షావుద్దీన్ సేవలు ఎనలేనివి



వరికుంటపాడు: మండల ఎంఈఓ–1 ఎస్‌డీ షావుద్దీన్ సోమవారం ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో షావుద్దీన్ ఉద్యోగ విరమణ సన్మాన సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఎంఈఓగా షావుద్దీన్ అందించిన సేవలను కొనియాడారు. ఆయన శేషజీవితం సుఖంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం షావుద్దీన్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలాధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే


పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

మర్రిపాడు: భారత రాజ్యాంగ చట్టం ప్రకారం అందరూ సమానమేనని, వర్గ, వర్ణ, విభేదాలు లేకుండా సమాజంలోని అందరూ కలిసికట్టుగా జీవించాలని మండల తహసీల్దార్ స్వప్న పేర్కొన్నారు. మండలంలోని పొంగూరులో ఆదివారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో తహసీల్దార్ మాట్లాడారు. గ్రామాల్లో అందరూ కలిసికట్టుగా వివక్ష లేకుండా జీవనం సాగించాలన్నారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను గౌరవించాలన్నారు. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో పిల్లలను బాగా చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగమణి, సీఐ గంగాధర్, ఎస్సై శ్రీనివాసరావు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు శేషం సుదర్శన్, సచివాలయాల సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


ఘటనా స్థలం..


మృతుడు నరసింహరావు

సంగం: మండలంలోని కొరిమెర్ల సమీపంలో ఆదివారం రాత్రి బైక్, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు.. నరసారావుపేటకు చెందిన వీ నరసింహరావు(24) 15 ఏళ్ల క్రితం తల్లిదండ్రులతో కలిసి విడవలూరు మండలం అన్నారెడ్డిపాళేనికి వచ్చారు. తల్లిదండ్రులు వ్యవ సాయ పనులు చేసు కుంటుండగా, నరసింహరావు వరికోత మెషీన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆది వారం రాత్రి ఏఎస్‌పేట గంధ మహోత్సవానికి మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. కొరిమెర్ల సమీ పంలోని అమ్మ ఆదిపరాశక్తి ఆశ్రమం వద్ద ఎదు రుగా వస్తున్న ఏఎస్‌పేట నుంచి నెల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని అక్కడిక్కడే మృతి చెందారు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉదయగిరిలో ఓ మోస్తరు వర్షం

ఉదయగిరి: ఉదయగిరిలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఒక్కసారిగా సాయంత్రం వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షం మెట్ట, ఉద్యాన పంటలకు కొంత ఊరటనిచ్చింది.

సొంతింటి కల నెరవేరేనా?


కావలిలో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలు

- అసంపూర్తిగా పక్కాగృహ నిర్మాణాలు
- ఆర్థిక సహకారం అందించని కొత్త ప్రభుత్వం
- మన ఇల్లు- మన గౌరవం పేరుతో హడావుడి
- మార్చిలోగా నిర్మాణాలను పూర్తి చేయాలని షరతు
- ఆందోళనలో లబ్ధిదారులు

కావలి: పేదల సొంతింటి కలను సాకారం చేయాలని భావించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో సొంతిళ్లు లేని వారికి నివేశన స్థలాలను కేటాయించింది. గృహ నిర్మాణాలను మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకే ఆప్షన్లు ఇచ్చింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్లను నిర్మించునే అవకాశాన్ని కల్పించింది. దీంతో ప్రభుత్వ గృహ నిర్మాణాలు చురుగ్గా సాగాయి. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో బిల్లుల మంజూరులో జాప్యం జరగడంతో పనులు నిలిచిపోయాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మన ఇల్లు- మన గౌరవం పేరుతో మార్చిలోగా నిర్మాణాలను పూర్తి చేయాలని హడావుడి చేయడమే తప్ప బిల్లులు మంజూరుకు చర్యలు తీసుకోకపోవడంతో లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో కావలి పట్టణం, మండలం, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాల్లో 24,458 మందికి నివేశన స్థలాలు మంజూరు చేసింది. వారిలో 14,793 మందికి పక్కాగృహాలు మంజూరయ్యాయి. అందులో 11,501 మంది పక్కాగృహ నిర్మాణాలను ప్రారంభించారు. వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్నాయి. 3,292 మంది ఇంకా ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టాల్సి ఉంది. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో బిల్లులు మంజూరుకాక పక్కాగృహ నిర్మాణాలు నిలిచిపోయాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా మూడు నెలల పాటు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గృహ లబ్ధిదారుల్లో ఉత్కంఠ నెలకొంది.

మార్చిలోగా పూర్తి చేయాలని..

కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మూడు నెలల పాటు గృహ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేసింది. ప్రస్తుతం మన ఇల్లు-మన గౌరవం పేరుతో హడావుడి చేస్తోంది. గృహ లబ్ధిదారుల వద్దకు అధికారులను పంపి మార్చిలోగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని, లేకపోతే ఇళ్లను రద్దు చేస్తామని షరతులు విధిస్తుండడంపై లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. ఆర్థిక సహకారం అందించకుండా సమావేశాలు పెట్టి హడావుడి చేయడంపై అధికారులను నిలదీస్తున్నారు.


గృహ నిర్మాణాలు చేపట్టక ఖాళీగా ఉన్న స్థలాలు

ప్రతిభకు ప్రోత్సాహం.. భవితకు ఉపకారం

- ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉపకార వేతనాలు
- ఎన్‌ఎంఎస్ పథకం కింద అందజేస్తున్న కేంద్రం
- ఏడాదికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్ల పాటు మంజూరు
- 8వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- డిసెంబర్ 17 వరకు దరఖాస్తునకు అవకాశం


ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఉదయగిరి: చదవుకోవాలనే తపన, ఏదైనా సాధించాలనే పట్టుదల, ఉన్నత శిఖరాలకు చేరాలనే ఆకాంక్ష ఉన్నా అనేక మంది విద్యార్థులకు ఆర్థిక పరిస్థితులు అనుకూలించడం లేదు. దీంతో ప్రతిభ ఉన్నా చదువు మానేసి కూలీ పనులు చేసుకోవాల్సిన పరిస్థితి. దీనిని గమనించిన కేంద్ర ప్రభుత్వం ప్రతిభ గల విద్యార్థులకు ఆర్థిక చేయూతతో విద్యా ప్రగతికి బాటలు వేస్తోంది. విజ్ఞానమే కొలమానంగా ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. జాతీయ ఉపకార వేతనం పథకం ద్వారా ఏడాదికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్లపాటు అందజేస్తోంది. తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో మంచి స్థాయిలో స్థిరపడాలని తల్లిదండ్రులు కలలు కంటారు. పేదరికం కారణంగా వారి ఆశలు అడియాశలు అవుతున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి చదివించే స్థోమత లేక చదువులు అర్ధంతరంగా ఆగిపోతున్నాయి. ఈ పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ఇది గమనించిన కేంద్ర ప్రభుత్వం 2008లో పేద పిల్లల కోసం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. ఏటా 8వ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభ కనబర్చిన వారికి నాలుగేళ్ల పాటు ఉపకారవేతనం అందజేస్తుంది.

అర్హతలు

ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులు ఎన్‌ఎంఎస్ పరీక్ష రాసేందుకు అర్హత ఉంటుంది. వీరు ఆరు, ఏడో తరగతుల్లో 50 శాతం మార్కులతో పాసై ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50లక్షలకు మించకూడదు. పాఠశాలలో రెగ్యులర్ విధానంలో చదువుతూ ఉండాలి.

పరీక్ష విధానం

ఎన్‌ఎంఎస్ పరీక్ష మొత్తం ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. మూడు గంటల వ్యవధిలో 180 ప్రశ్నలకు సమాధానం రాయాలి. పరీక్షలో ప్రతిభకనబర్చిన వారిని ఉపకారవేతనానికి ఎంపిక చేస్తారు.

ఏడాదికి రూ.12వేలు మంజూరు

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12వేలు చొప్పున ఉపకారవేతనం అందజేస్తారు. ఏటా విద్యార్థి బ్యాంకు ఖాతాలో నగదు జమచేస్తారు. ఈ పథకం పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

దరఖాస్తుల ఆహ్వానం

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్‌ఎంఎస్ పరీక్షకు ఆగస్టు 5వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. డిసెంబరు 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఓసీ, బీసీలు రూ.100, ఎస్టీ, ఎస్సీలు రూ.50 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న వివరాల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఎన్‌ఎంఎస్ పథకం ఎంతో ఉపయోగకరం. 8వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబర్చితే నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేలు చొప్పున ఉపకారవేతనం అందజేస్తారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– తోట శ్రీనివాసులు,ఎంఈఓ, ఉదయగిరి